ప్రజాశక్తి
శనివారం 8 మార్చి 2025

గృహ నిర్మాణశాఖ పీడీకి వినతి

ప్రజాశక్తి-హుకుంపేట: మండలం వ్యాప్తంగా పీవీటీజీ ఇల్లు గ్రాంట్ సర్వే ఎంపికలో గడ్డి ఇల్లు కు బదులు గా పక్కా స్లాబ్ ఇల్లు గా నమోదు చేయడంతో అనేకమంది పీవీటీజీ కుటుంబాలకు ఇల్లు మంజూరు కాలేదని అల్లూరి జిల్లా హౌసింగ్ పీడీ బాబూ నాయక్‌కు వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు వినతిపత్రం శుక్రవారం అందించారు. స్పందించిన పీడీ బాబూనాయక్ త్వరలోనే పూర్తి వివరాలు ఏ.ఈ ల నుండి వివరాలు సేకరించి ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కొర్ర రాజయ్య, బురద గుమ్మికు చెందిన సీదరి సుక్రం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న వైస్ ఎంపిపి

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి పాడేరు: జల్ జీవన్ మిషన్ లో మంజూరు చేసిన తాగునీటి పనులు అరకొరగా చేస్తే క్రమ శిక్షణా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ స్పష్టం చేసారు. జల్ జీవన్ మిషన్ తాగునీటి పథకాల నిర్మాణాలకు రూ.143 కోట్ల ఖర్చు చేసామన్నారు. పనులు పూర్తి చేసిన గ్రామాల నుండి తాగు నీరందడం లేదని ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు తయారు చేసి ఆ దిశగా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్ నుండి పి. ఓలు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజనీరింగ్ అధికారులు, ఎంపిడి ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పనులు పూర్తి స్థాయిలో జరిగి నీరిందించాక కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలని సూచించారు. తాగునీటి పనులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మీకోసంలో తాగునీటి కోసం అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. జల్ జీవన్ మిషన్ లో ఇంటింటికి తాగునీరందించ వలసిన బాధ్యత గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజనీరింగ్ అధికారులపైనే ఉందని తెలిపారు. ఎన్ని గ్రామాలలో రక్షిత మంచి నీరందిస్తున్నామని ఆరా తీసారు. తాగునీటి పథకాలను పర్యవేక్షించాలని ఎంపిడిఓలను ఆదేశించారు. ఎంపిడిఓ లకు, ఇంజనీరింగ్ అధికారులకు తాగునీటి పథకాల నిర్మాణం, నిర్వహణపై వర్క్‌షాపు నిర్వహించాలని ఐటిడి ఏ ప్రాజెక్టు అధికారులకు సూచించారు. గ్రామంలో ఎన్ని ఇళ్లు ఉన్నాయి? ఎంత నీరు అందుబాటులో ఉంది ? ఎంత నీరు వినియోగిస్తున్నారో నివేదికలు సిద్ధం చేయాలన్నారు. తాగునీటి పథకాలను ఇంజనీరింగ్ అధికారులు, ఎంపిడిఓలు, సచివాలయం సిబ్బంది, ఇ ఓ పి ఆర్ డిలు తనిఖీ చేయాలన్నారు. తాగు నీటి పథకాల నిర్వహణకు పంచాయతీ నిధులు వినియోగించుకోవాలన్నారు. గ్రామాలలో వాటర్ శానిటేషన్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి పథకాల నిర్మాణాలో ప్రజా ప్రతి నిధులను భాగస్వామ్యం చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటిడిఏ పిఓలు ఎం.జె. అభిషేక్ గౌడ, కట్టా సింహాచలం, అపూర్వ భరత్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజనీరింగ్ అధికారి జవహార్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి బి.లవరాజు, గ్రామ సచివాలయాల జిల్లా కో ఆర్డినేటర్ పి.ఎస్. కుమార్, డిఇలు, ఎఇలు, ఎంపిడిఓలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్

అభివాదం చేస్తున్న నాయకులు

ఆదివాసీ ప్రజా సంఘాల జెఎసిని రద్దు చేస్తున్నాం

- నూతన జెఎసి ఏర్పాటుపై 11న సమావేశం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: 1/70 చట్టాన్ని వ్యతిరేకిస్తూ వ్యవహరించిన రొబ్బి శంకర్రావు తీరుపై ఆదివాసీ ప్రజా సంఘాలతో ఏర్పడిన జెఎసిని తక్షణమే రద్దు చేస్తున్నామని జెఎసి మాజీ జిల్లా నాయకులు కాంగు చిన్ని, కూడ సుబ్రహ్మణ్యం, కూడ రాధాకృష్ణ, కిల్లో సురేంద్ర, పాలికి లక్కు అన్నారు. పాడేరులో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివాసీ ప్రజా సంఘాల త్యాగాల ఫలితంగా ఏర్పడిన జెఎసిని కొంతమంది వ్యక్తులు ప్రయోజనాల కోసం తాకట్టు పెట్టారని, ప్రజా సంఘాల ఆమోదం లేకుండా లేకుండా, కనీసం సంప్రదించకుండా, ఏకపక్షంగా జెఎసిని రిజిస్ట్రేషన్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఏకపక్షంగా జెఎసి పేరుతో కార్యాచరణలు ప్రకటించడం, ఉద్యమ స్ఫూర్తికి ద్రోహం చేయడమేనన్నారు. హక్కులు, చట్టాలు పరిరక్షించడంలో భాగంగా ఉద్యమాల కార్యాచరణలో ఏకపక్ష ధోరణితో జెఎసి వైఫల్యం చెందిన విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు ఈ నేపథ్యంలో ప్రజా ఉద్యమం నిర్మించడం కోసం, ఆదివాసి హక్కులు, చట్టాల పరిరక్షణ కోసం మార్చి 11న పాడేరులో అఖిలపక్ష, ఆదివాసీ ప్రజా సంఘాల నాయకులు, ప్రతినిధులు సమావేశం నిర్వహించడం జరుగుతుందని, ఈ సమావేశానికి జెఎసిలో ఉన్న నాయకులనూ ఆహ్వానిస్తామని పేర్కొన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలపై మరో పోరాటం

గ్రామాల్లో ప్రజా చైతన్య యాత్రలు : సిపిఎం

మాట్లాడుతున్న సిపిఎం విఆర్.పురం మండల కార్యదర్శి సంతోష్‌కుమార్

ప్రజాశక్తి-విఆర్.పురం

ప్రభుత్వాలు మారిన పోలవరం నిర్వాసితుల బతుకులు మారలేదని, నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి మరో పోరాటానికి సిద్ధం కావాలని సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని రేఖపల్లి సిపిఎం కార్యాలయంలో శుక్రవారం జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో సంతోష్ కుమార్ మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల సమస్యలపై ఈనెల 11 నుంచి సిపిఎం ఆధ్వర్యాన ప్రజా చైతన్య యాత్రలు గ్రామ గ్రామాన నిర్వహిస్తామని చెప్పారు. ప్రాజెక్ట్ పనులు చేపట్టి ఏళ్లు గడుస్తున్నా నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేసే దిశగా ప్రభుత్వాలు ఆలోచించడం లేదన్నారు. మొదటి కాంటూరులో మునిగే గ్రామాల నిర్వాసితులకు ఇప్పటివరకు పూర్తి ప్యాకేజీ, నష్టపరిహారం చెల్లించలేదని, వారి గురించి అధికారులు, ప్రభుత్వం ఒక్క మాట కూడా మాట్లాడడం లేదని తెలిపారు. భూమికి భూమి ఇప్పటికీ కేటాయించలేదన్నారు. అయినా అధికారులు మాత్రం పునరావాస కాలనీలు పూర్తి చేసి జూన్ లోగా పంపిస్తామని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు సిపిఎం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కారం సుందరయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు సున్నం రాజులు, సోయం చిన్నబాబు, మండల నాయకులు పోడియం శ్రీరామ్మూర్తి, వడ్లాది రమేష్, తోడం రాజు, గుండిపూడి లక్ష్మణరావు, కమ్మచిచ్చు.సత్యనారాయణ, తుర్రం బాబురావు, కారం సత్తిబాబు, పులి బొజ్జి తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు పోరాటం

కూనవరం : మండల కేంద్రంలో మార్త శ్రీరామ్మూర్తి భవన్‌లో తెల్లం తమ్మయ్య అధ్యక్షతన శుక్రవారం సిపిఎం మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి బాబు బొర్రయ్య మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల ఒక్క పేరు తొలగించిన ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. వరదలకు మునిగే ప్రతి గ్రామాన్ని మొదటి కాంటూర్లో చేర్చాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు పునరావాసం కల్పించాకే పోలవరం ప్రాజెక్టు నిర్మించాలన్నారు. మొదటి లిస్ట్, రెండో లిస్ట్ పేర్లతో ప్రజలను గందరగోళపర్చడం సరికాదన్నారు. నిర్వాసితుల సమస్యలపై ఈ నెల 11 నుండి మండలంలో ప్రజా చైతన్య యాత్రను నిర్వహిస్తున్నామని, నిర్వాసితులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు పాయం సీతారామయ్య, మడకం నాగమణి, మడెం బాబురావు, తాళ్లూరి శ్రీనివాసరావు, కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న సిపిఎం నాయకులు

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేశ్వరరావు

ప్రజాశక్తి-ఎటపాక

మండలంలోని గుండాల వద్ద గోదావరి నుండి తెలంగాణకు అక్రమంగా తరలిస్తున్న ఇసుక రవాణాను అడ్డుకోవాలని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మర్లపాటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని మాధవరావు పేటలో సవలం రాము అధ్యక్షతన శుక్రవారం జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడారు. గుండాలలో అధికారికంగా ఒక ఇసుక ర్యాంపు ఉండగా అక్రమార్కులు మరో ఇసుక ర్యాంపును ఏర్పాటు చేసుకొని రాత్రి సమయంలో తెలంగాణకు ఇసుకను తరలిస్తున్నారని తెలిపారు. గుండాలలో రెండు డంపింగ్ యార్డ్‌లలో ఇసుక అందుబాటులో ఉన్నప్పటికీ ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి కొట్టి అక్రమ మార్గంలో ఇసుక రవాణా చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం పూర్తిగా విఫలమైందన్నారు. భారీ యంత్రాలతో ఇసుక తవ్వి లారీలలో రాత్రంతా తెలంగాణకు సరఫరా చేస్తున్నారని, అయినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా నిఘా పెట్టి అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. పీసా కమిటీలు ఉన్నప్పటికీ వాటిని పరిగణనలోకి తీసుకోకుండా ఇసుక అమ్మకాలు జరుగుతున్నయని, వాటిని వెంటనే నిలుపుదల చేసి కొత్తగా సొసైటీ ద్వారా అమ్మకం చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఐవి, మండల కార్యదర్శి కాకా అర్జున్ దొర, సభ్యులు పులుసు బాలకృష్ణ, ఇరపా అజయ్, బుద్ధుల భద్రయ్య, పొడియం రత్తమ్మ, గద్దల హుస్సేన్ పాలొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేశ్వరరావు

మహిళలపై దాడులను అరికట్టడంలో విఫలం

- ఐద్వా రాష్ట్ర నాయకురాలు వివి.జయ

మాట్లాడుతున్న వివి,జయ

ప్రజాశక్తి-అరకులోయరూరల్: మండల కేంద్రంలోని ఐద్వా మహిళ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా అంతర్జాతీయ మహిళ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం భవనంలో ఈ సదస్సును ఉద్దేశించి ఐద్వా రాష్ట్ర నాయకురాలు వివి.జయ మాట్లాడుతూ, మహిళలపై రోజురోజుకు హింస, వేధింపులు పెరుగుతున్నాయని దాన్ని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమవుతుందని పేర్కొన్నారు. మార్చి 8న అమెరికాలో న్యూయార్క్ సిటీలో కుట్టు మిషన్ పరిశ్రమ లో శ్రామిక మహిళల పై హింస, లైంగిక వేధింపులు, వెట్టిచాకిరి శ్రమ దోపిడీ నియంత్రణ లేని పని గంటలు సమస్యలపై 1845 లో పెద్ద ఎత్తున పోరాటం జరిగిందన్నారు. ఆ పోరాటంలో మహిళల పై కాల్పులు జరిపితే 146 మంది ప్రాణాలర్పించారని పేర్కొన్నారు. సమానత్వంతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని మహిళలకు అవకాశం ఇస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తారన్నారు.వ్యవసాయం నుంచి అంతరిక్షం వరకు సకల రంగాల్లో స్త్రీలు సమున్నత స్థానాల్లో విశిష్ట కృషి చేస్తున్నారాన్నారు. మహిళలకు పని ప్రదేశాల్లో రక్షణ లేకపోవడం నిత్యకృత్యం అయిపోయిందన్నారు. మారిన ఆర్థిక పరిస్థితుల్లో మహిళలు పనిచేయకపోతే కుటుంబం గడవలేని పరిస్థితి ఉందన్నారు. మద్యాన్ని అరికట్టాల్సిన ప్రభుత్వాలు దానిని ఆదాయ వనరులుగా చూడటం దుర్మార్గమన్నారు. స్కీం వర్కర్లకు కనీస వేతం 26,000 ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల సెక్రెటరీ కె.శశికళ, తులసమ్మ, ఎస్ చంప, సుందరమ్మ, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు కె రామారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు: జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీలో ఐదుగురు ఎస్సీ, ఎస్టీ నాన్ ఆఫీసియల్ మెంబర్ల నియామకానికి, ముగ్గురు స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న నాన్ ఎస్సీ ఎస్టీ కులాల వారిని నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కమిటిలో సభ్యులుగా దరఖాస్తు చేసుకొన్న వారు అల్లూరి సీతారామ రాజు జిల్లా వాసులై ఉండాలని, సంబందిత ఆధారాలు (ఫోటోలు/పత్రములతో సహా) తో వారి పూర్తి బయోడేటాతో జతపరచి జిల్లా షెడ్యూల్డ్ కుల సంక్షేమ, సాధికారిత అధికారి, అల్లూరి సీతారామ రాజు జిల్లా వారికి ఈ నెల 17వ తేదీలోపు సమర్పించాలని సూచించారు.. ఇతర వివరాలకు 8985868068, 7036408143 మొబైల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పాడేరు : పిఎం ఇంటర్న్ షిప్ నమోదుకు గడువు ఈనెల 12తో ముగియనున్నందున అర్హులైన వారు వెబ్ సైటులో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కార్మిక శాఖ అధికారి టి.సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. పీఎం ఇంటర్న్ షిప్ ఏడాది కాలం వ్యవధి ఉంటుందశ్రీవప్త్రశ్రీనఅ. అభ్యర్థులకు ప్రతి నెల రూ.5 వేలు ఆర్థిక సాయంతో పాటు, మరో రూ.6వేలు ఒకసారి ఆర్థిక సాయం అందించడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు.

కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ పీఎం ఇంటర్న్ షిప్ స్కీం నమోదును ప్రారంభించినందున అర్హత గల అభ్యర్థులు వెబ్ సైట్లో ఈనెల 12లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటర్న్ షిప్ దరఖాస్తు ద్వారా వివిధ రంగాల్లో అవకాశాలు పొందవచ్చన్నారు. 21 నుంచి 24 ఏళ్ల గల విద్యావంతులు అర్హులని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పోటీలను ప్రారంభిస్తున్న సిఐ, నాయకులు

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి-హుకుంపేట: మహిళా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కేజీబీవీ, గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలిక ఇంగ్లీష్ మీడియం పాఠశాలల విద్యార్థులకు ఆటలు పోటీలు శుక్రవారం నిర్వహించారు. మహిళలకు రన్నింగ్ పోటీలు నిర్వహించారు. స్థానిక సిడిపిఓ సిహెచ్ బాలమణి దేవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ముఖ్యఅతిథిగా పాల్గొన్న పాడేరు సర్కిల్ ఇన్స్పెక్టర్ సన్యాసి నాయుడు హుకుంపేట ఎంపీటీసీ కొమ్మ రమ, మండల విద్యాశాఖ అధికారి సోమేలి చెల్లయ్య చేతుల మీదుగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ సన్యాసినాయుడు మాట్లాడుతూ విద్యాతో పాటు క్రీడా రంగంలో కూడా విద్యార్థులకు రాణించాలన్నారు. చదువుతోపాటు మానసిక ఉల్లసాని పెంపొందించే వాటిని దృష్టి పెట్టాలన్నారు. చదువుపై మక్కువ చూపించడమే కాకుండా అన్ని రంగాల్లో రాణించాలన్నారు.ఈ కార్యక్రమంలో మానసి మిత్ర ఎన్జీవో కోఆర్డినేటర్ సురేష్, సర్పంచ్, మహిళ పోలీసులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని మహిళలు, బాలికలు అన్ని రంగాలలో ముందుండాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక డిగ్రీ ప్రభుత్వ కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమానికి పిఒ సింహాచలం, సబ్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారన్నారు. మహిళలకు పురుషులతో సమాన హక్కులు కల్పించాలని అనేక ఉద్యమాలు గతంలో జరిగాయని, దీంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమాన హక్కులు కల్పించడం జరిగిందని చెప్పారు. గిరిజన ప్రాంతంలో మహిళలు, బాలికలు అన్ని రంగాలలో ముందుండే విధంగా ఐటీడీఏ ప్రోత్సహిస్తుందని తెలిపారు. మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

సబ్ కలెక్టర్ కెఆర్. కల్పశ్రీ మాట్లాడుతూ ఏజెన్సీలోని ప్రతి బాలిక బాగా చదువుకొని పురుషులతో సమానంగా ఎదగాలన్నారు. రోజుకు 10 నుండి 12 గంటల పాటు చదువుపై దృష్టి పెట్టి మంచి ఉద్యోగాలు పొందాలన్నారు. చదువులు పూర్తయిన తర్వాతే పెళ్లి చేసుకోవాలని, బాల్య వివాహాలు నిర్మూలించే బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాల బాలికలకు వాలీబాల్, ఖోఖో, రంగోలి పోటీలు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వసుధ ఆధ్వర్యాన నిర్వహించారు. విజేతలకు ఈ సందర్భంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఐటిడిఎ పిఒ, సబ్ కలెక్టర్ చేతులమీదుగా అందజేశారు. అనంతరం సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీని సత్కరించారు. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు కళ్యాణి, చంద్రిక, న్యాయవాది బి.పద్మావతి, కళాశాల అధ్యాపకులు రవికుమార్, వెంకటేష్, చక్రవర్తి, సునీత, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ కల్పశ్రీని సన్మానిస్తున్న ఐటిడిఎ పిఒ సింహాచలం, ఇతర అధికారులు

విద్యార్థులను గ్రూపులుగా విడిదీసి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కౌమార బాల బాలికల సమస్యలపై అవగాహన

ప్రజాశక్తి-సీలేరు : కౌమార దశలో బాల బాలికలకు వచ్చే సమస్యలపై జీకే వీధి మండలం సీలేరు ఏపీ గురుకుల పాఠశాలలోనూ, సీలేరు ఆశ్రమ బాలికల పాఠశాలలో విద్యార్థులకు సఖి కార్యక్రమం ద్వారా ఐసిడిఎస్ సిడిపిఓ లక్ష్మీదేవి ఆధ్వర్యాన శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పది నుంచి 15 సంవత్సరాలు వయసుగల పిల్లల్లో వచ్చే శారీరక, మానసిక బావ వ్యక్తీకరణలో వచ్చే మార్పులు, భవిష్యత్తులో లక్ష్యాలు ఎలా చేరుకోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు నిరోధక చట్టం గురించి వివరించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సిడిపిఒ లక్ష్మీదేవి మాట్లాడుతూ కిశోర వికాసంలో భాగంగా సఖి గ్రూపులు ఏర్పాటు చేసి కౌమార బాల బాలికల సమస్యలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కమిటీలో ఐదుగురు సభ్యులుగా ఏఎన్ఎం దేవి, ఆశా వర్కర్ కరుణ కుమారి, అంగన్వాడీ టీచర్ రుక్మిణి ఈశ్వరి నియమించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ రేవతి, ఐసిడిఎస్ సూపర్వైజర్ మోహిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-సీలేరు : గూడెం కొత్త వీధి మండలం దారకొండ పంచాయతీలో పోలీసులు, దారకొండ పిహెచ్‌సి సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ శిబిరంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు 270 మంది గిరిజనులకు కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వీరిలో 32 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు వారికి ఈ నెల 10వ తేదీన శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించి శస్త్ర చికిత్సలు చేయిస్తామని జీకే వీధి సీఐ వరప్రసాద్, దారకొండ పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ డికె.హిమబిందు తెలిపారు. అలాగే దారకొండ, సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డీకే హిమబిందు, మస్తాన్ వల్లిలు సాధారణ ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. వ్యాధులు సోకిన వెంటనే ఆసుపత్రికి వచ్చి చికిత్స పొందాలని, నాటు వైద్యం, పసర మందులకు దూరంగా ఉండాలని గిరిజనులకు సూచించారు. గర్భిణులు తరచూ ఆరోగ్య తనిఖీలు చేయించుకొని ఆసుపత్రిలో ప్రసవం పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీలేరు ఎస్సై రవీంద్ర, శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్య నిపుణులు కె.రమేష్‌బాబు, ఏంఎల్‌హెచ్‌పిలు నాగమణి, లోవకుమారి పాల్గొన్నారు.

వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం

మహిళలకు కుట్టు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-పాడేరు:2024-25 ఆర్థిక సంవత్సర ములో బిసి కార్పొరేషన్, ఈడబ్ల్యుఎస్ కార్పొరేషన్, కాపు కార్పొరేషన్‌ల ద్వారా మహిళలకు ప్రాథమిక కుట్టు శిక్షణ తరగతులను ఈ నెల ఎనిమిదవ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రారంబించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్, బిసి కార్పొరేషన్ చైర్మన్ ఎఎస్ దినేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వివిధ కార్పొరేషన్ల ద్వారా 862 మంది మహిళలకు ప్రాథమిక కుట్టు శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. మహిళా లబ్ధిదారుల వయస్సు 18 నుండి 50 సంవత్సరముల లోపు ఉండి, అల్లూరి సీతారామరాజు జిల్లా నివాసులై ఉన్నవారు అర్హులన్నారు. తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలని, సచివాలయం ద్వారా పొందిన కుల ధృవీకరణ పత్రములు జత చేయాలని సూచించారు. పోర్ట్ సైజు ఫోటో జత చేసి మొబైల్ నెంబరు, పూర్తి అడ్రస్ తో దరఖాస్తు చెయాలన్నారు. బేసిక్ టైలరింగ్ పై శిక్షణ పూర్తయిన తర్వాత అభ్యర్థికి ఒక మోడల్ కుట్టు మిషన్ ఉచితముగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు వారి ధరఖాస్తు ఒక వారం రోజులలోగా ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ ప్రాంత అభ్యర్థులు సంబందిత మండల పరిషత్ అభివద్ధి అధికారి వారి కార్యాలయం లేదా గ్రామ సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ ల ద్వారా ధరఖాస్తు నమోదు చేసుకోవచ్చున్నారు.

బయో టాయిలెట్లను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-పాడేరు: కార్పోరేట్ సామాజిక భాద్యత కింద విజువిస్ అనే కలకత్తాకు చెందిన సంస్థ స్థానిక తలారిసింగి గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాటశాల, కళాశాలకు రెండేసి బయో టాయిలెట్లను నిర్మించిందని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ తెలిపారు. విశాఖపట్నం కు చెందిన మంత్రి సత్యనారాయణ చారిటబుల్ సంస్థ ఆద్వర్యంలో నిర్మించబడిన ఈ బయో టాయిలెట్లను శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కార్పోరేట్ సంస్థలు వారి సామాజిక భాద్యత కింద చేపట్టిన పనులను పట్టణాలలోనే కాకుండా అవసరమైన ఇటువంటి మారు మూల ప్రాంతంలో గిరిజనులకోసం వినియోగించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. వారు గిరిజనులపట్ల ఎంతో ఉదారతతో నిర్మించిన ఈ బయో టాయిలెట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, ఎప్పటికప్పుడు శుభ్ర పరుచుకుని నిర్వహణను మెరుగు పరుచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిధులు కేటాయించిన విజువిస్ సంస్థను, ఎం ఎస్ ఎన్ చారిటబుల్ సంస్థ అధినేత మంత్రి సత్యనారాయణను కలెక్టర్ అభినందించారు. సిఎస్ఆర్ కింద మరిన్ని సదుపాయాలు జిల్లాలో కల్పింకాహావలసినదిగా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ కళాశాల ప్రిన్సిపాల్ జి. గణేష్, ఆశ్రమ పాటశాల హెచ్ ఎం కె. ధనలక్ష్మి, విద్యార్థులు, తదితరులు పాల్గొనారు.

చీరల పంపిణీ

ప్రజాశక్తి-పాడేరు:మండలంలోని కాడేలి పంచాయతీ వర్తనపల్లిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ వైస్ చైర్మన్ సొనాయి గంగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలు కేవలం వంటింటికే పరిమితం కాకుండా, పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుకు రావాలన్నారు. మహిళా మణులు ఉన్నత రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ సరోజిని, లకే సింహాచలం చేతుల మీదుగా, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సెంట్రల్ కమిటీ సభ్యులు బొర్రా నాగరాజు, సొసైటీ సభ్యులు, ఎం.మణి, మణ్యం, రూడి రవనమ్మ, మాజీ ఎంపిటిసి సాగిన మత్స్యకొండమ్మ, మాజీ ఎంపిపి తెలుగు దేశం రాష్ట్ర నాయకురాలు బొర్రా విజయరాణి, గ్రామ పెద్ద బాలకృష్ణ పాల్గొన్నారు.

భద్రతా వారోత్సవం

ప్రజాశక్తి-సీతమ్మధార : నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైర్ అండ్ సేఫ్టీ (ఎన్ఐఎఫ్ఎస్) ఆధ్వర్యాన భద్రతా వారోత్సవం ఘనంగా నిర్వహించారు. సేఫ్టీ అండ్ వెల్ బీయింగ్ ఫ్రానియల్ ఫర్ విజన్ భారత్ అనే ఇతివృత్తంతో భద్రతా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఇతివృత్తంలో భాగంగా రోడ్డు భద్రతా అవగాహన పై ర్యాలీ, ఉచిత ఐ చెక్ అప్, ఫైర్ ఫైటింగ్ ప్రదర్శన చేపట్టారు. విద్యార్థుల కోసం సేఫ్టీ క్విజ్, వ్యాసరచన, ప్రసంగం (ఎలోక్యూషన్), అంతర్గత, బహిరంగ క్రీడల వంటి పోటీలు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎన్ఐఎఫ్ఎస్ సిఇఒ కుసుమకుమార్ మాట్లాడుతూ, ఊహించని అగ్ని ప్రమాదాలకు ఎలా స్పందించాలో, ప్రథమ చికిత్స ఎలా అందించాలి అనే అంశంపై అవగాహనా కార్యక్రమాలు చేపట్టామని, ఇలాంటి కార్యక్రమాలు భద్రతపై శాఖ కార్యాలయం వద్ద నిర్వహించినట్లు ఆమె తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ భద్రతా నియమాలను పాటించి, ప్రమాదాలను నివారించేందుకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

సమస్యల పరిష్కారంపై శ్రద్ధ పెట్టాలి

- జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్
- మీ కోసంలో 143 వినతులు స్వీకరణ

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పాడేరు ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసంకు వినతులు వెల్లువెత్తాయి. జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్, జెసి ఎంజె అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డిఆర్ఒ కె.పద్మలత వివిద మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 143 వినతులను స్వీకరించారు. రహదారుల నిర్మాణాలు, తాగునీటి సమస్యలు, అటవీ హక్కు పత్రాల పంపిణీ, భూ సమస్యలు, గృహాల మంజూరు కోసం అధికంగా అర్జీలు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ, మీ కోసంలో స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు శ్రద్ద పెట్టాలన్నారు. సమస్యలు పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించనని హెచ్చరించారు. ఫిర్యాదుల పరిష్కారంపై క్షేత్ర స్థాయి సిబ్బందితో సమీక్షించాలని జిల్లా అధికారులకు సూచించారు.

స్వీకరించిన ఫిర్యాదుల్లో కొన్ని..

హుకుంపేట మండలం మత్స్యపురం సర్పంచ్ పాతుని చంద్రన్న పాత్రుడు మత్స్యపురం గ్రామంలో 100 మంది పోడు భూములను సర్వే చేసి 40 మందికి పట్టాలు పంపిణీ చేసారని మిగిలిన వారికి పట్టాలు పంపిణీ చేయాలని వినతి పత్రం సమర్పించారు.చింతపల్లి మండలం లోతుగెడ్డ గ్రామస్తుడు పొంగి అప్పారావు ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తును అందజేసారు. పెదబయలు మండలం పెద కోడాపల్లి పంచాయతీ వలుగుపల్లి గ్రామానికి చెందిన అర్లాబు నాగేశ్వరరావు తన కాఫీ తోట చుట్టూ రాతి గట్టు నిర్మించాలని వినతి పత్రం సమర్పించారు. పాడేరు మండలం డోకులూరు పంచాయతీ తోటలగొంది, గొందిగరువు గ్రామాలలో తాగునీటి సమస్యలు పరిష్కరించాలని కె. శ్రీను, ఎం. ఇరుగు, వి. రాంబాబు తదితరులు అర్జీని అందజేసారు. పెదబయలు మండలం కిముడుపల్లి పంచాయతీ అరడ గూడెం, చిట్టగరువు గ్రామాలకు బి.టి రోడ్డు నిర్మించాలని సర్పంచ్ శోభారాణి వినతి పత్రం సమర్పించారు.డుంబ్రిగుడ మండలం గసభ గొంది వలస బిటి రోడ్డు నుండి మొర్రిగుడ గ్రామం వరకు బిటి రోడ్డు నిర్మించాలని గసభ సర్పంచ్ సునీత దరఖాస్తును అందజేసారు. ఈ కార్యాక్రంలో గృహ నిర్మాణ శాఖ పిడి బి.బాబు, డిఆర్‌డిఎ పిడి వి.మురళి, టిడబ్ల్యూ డిడి ఎల్.రజని, డిఎంహెచ్ .జమాల్ భాషా, డిఇఒ పి.బ్రహ్మాజీరావు, ఐటిడిఎ పరిపాలనాధికారి ఎం.హేమలత, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బిఎస్ నంద్, టిడబ్ల్యూ ఇఇలు కె.వేణుగోపాల్, జి.డేవిడ్ రాజు, ఆర్ డబ్ల్యూఎస్ ఇఇ జవహార్ కుమార్ పాల్గొన్నారు.

బ్యాంకు అధికారులపై విచారణ చేపట్టాలి

డుంబ్రిగుడ : బ్యాంకు అధికారులపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని జిల్లా కేంద్రం పాడేరులో జరిగిన మీ కోసం కార్యక్రమంలో కించుమండ గ్రామానికి చెందిన దుర్గమ్మ డ్వాక్రా సంఘ సభ్యులు శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. బ్యాంకు ఆవరణలో నిరసన వ్యక్తం చేసిన సభ్యులు పాడేరు చేరుకుని జిల్లా కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. 2009లో బ్రిడ్జిలోన్ ద్వారా రూ.1లక్ష, బ్యాంకు లింకేజీ ద్వారా రూ.50వేలు సంఘ సభ్యులు రుణాన్ని పొందామన్నారు. పొదుపుతో పాటు తీసుకున్న రుణాన్ని దశల వారిగా చెల్లించేవారమని ఆ సంఘం అధ్యక్షురాలు, కార్యదర్శి అమ్మి, సీతమ్మ తెలిపారు. కరోనా, సమయంలో పొదుపు, రుణాన్ని కట్టలేక పోవడం జరిగిందన్నారు. టి డి పి హయంలో పసుపు కుంకుమ, వైకాపా హయంలో అసరా ద్వారా సంఘ సభ్యుల ఖాతాలో రూ. 2 లక్షలు మేర జమ అయ్యిందన్నారు. వెలుగు అధికారులతో తీర్మాణం చేయించి ప్రభుత్వాలు జమ చేసిన నగదును తీసుకోవడానికి బ్యాంకుకు వెళ్లడం జరిగిందని చెప్పారు. బ్యాంకు అధికారులు తీసుకున్న రుణం ఉందని సమాధానం చెబుతూ ఏడాదిగా బ్యాంకు చుట్టూ తిప్పించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సత్వరమే బ్యాంకు అధికారులపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని వినతి పత్రంలో పేర్కొవడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా సభ్యులు పాల్గొన్నారు.

ఔషధ పరిశోధనల్లో సవాళ్లను ఎదుర్కోవాలి

గీతం ప్రో వైస్ ఛాన్సలర్ గౌతమరావు

ప్రజాశక్తి-మధురవాడ : కోవిడ్ తదనంతరం ప్రపంచ వ్యాప్తంగా సరికొత్త ఆరోగ్య సంబంధ సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో వైద్య రంగం సవాళ్లను ఎదుర్కొంటోందని, వీటిని ఔషధ పరిశోధనల ద్వారా ధీటుగా ఎదుర్కోవాలని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు పేర్కొన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించిన ఫార్మశీ రంగంలో నూతన పోకడలు అనే జాతీయ సదస్సును ఆయన ముఖ్యఅతిథిగా హజరై ప్రారంభించారు. ఔషధ రంగంలో భారత దేశానికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందని, ముఖ్యంగా లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాల ప్రజలకు భారతీయ ఔషధాలు ఆధారం అని తెలిపారు. ఔషధాల తయారీలో పరిశోధన నుంచి ఉత్పాదన, మార్కెటింగ్ వరకు కాలానుగుణంగా మారుతున్న సాంకేతికతను ఉపయోగించుకుని ఫలితాలు సాధించాలని సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ డీన్ ప్రొఫెసర్ జగత్తరణ్‌దాస్ మాట్లాడుతూ, ఔషధ పరిశోధన జరిగాక అవి పరిశ్రమలలో ఉత్పత్తి చేసి ప్రజలకు అందడానికి దాదాపు 10 సంవత్సరాల సమయం, భారీగా నిధులు అవసరం పడుతున్నాయని పేర్కొన్నారు. కృత్రిమ మేధ వంటివి ఉపయోగించుకుని త్వరతగతిన ఔషధాలను మార్కెట్‌లోకి తీసుకురావాల్సి ఉందన్నారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (హైదరాబాద్) డైరక్టర్ డాక్టర్ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మానవాళికి అవసరమైన ఔషధాలను అన్వేషించడంలో స్టీరియో కెమిస్ట్రీ ముఖ్య పాత్ర పోషిస్తోందన్నారు. ఒక మందు బయటకు రావాలంటే దాదాపు 5వేల మాలిక్యూల్స్‌ను పరిశోధించి ఔషధ గుణాలను వెలికి తీయాల్సి వస్తోందన్నారు. కృత్రిమ మేధ ద్వారా ఈ సమయాన్ని తగ్గించడంపై యువ పరిశోధకులు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. సెంట్రల్ డ్రగ్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సిడిఎస్‌సిఒ) అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ కె.భువనేశ్వరి మాట్లాడుతూ, దేశంలో దాదాపు 10 వేల ఔషధ ఉత్పత్తి పరిశ్రమలు ఉన్నాయని, ఔషధాల ఎగుమతిలో భారతదేశం ప్రపంచంలో మూడవ స్థానంలో ఉందని తెలిపారు. 1940 డ్రగ్స్ కాస్మెటిక్స్ చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎల్.శ్రీనివాస్, ఆర్జిన్ అంకాలజీ లిమిటెడ్ సీనియర్ డైరక్టర్ డాక్టర్ ఎన్.కవిత, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చి (బరంపూర్) సహయ ప్రొఫెసర్ డాక్టర్ వివేక్ తివారి, గీతం బయోకెమిస్ట్రీ ప్రొఫెసర్ మళ్ల రామారావు, సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ పార్థారాయ్ పాల్గొని ప్రసంగించారు. నగరంలోని వివిధ కళాశాలల నుంచి ఫార్మశీ విద్యార్థులు, పరిశోధకులు హజరయ్యారు.

కమ్యూనికేషన్ రంగంలో విస్తృత అవకాశాలు

- గీతంలో దూరదర్శన్ మాజీ అధికారి రంగనాథమ్

ప్రజాశక్తి-మధురవాడ : టెలీ కమ్యూనికేషన్ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులు ఇంజినీరింగ్ విద్యార్థులకు విస్తృత ఉపాధి అవకాశాలను కల్పించనున్నాయని, ముఖ్యంగా సాంకేతిక ప్రగతిలో స్వదేశీ పరిజ్ఞానం కీలక పాత్ర పోషించనున్నదని దూరదర్శన్ మాజీ డిప్యూటీ డైరక్టర్ జనరల్ ఎమ్‌వి డాక్టర్ డి.రంగనాథమ్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఇఇసిఇ విభాగం, బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ సొసైటి (ఇండియా) హైదరాబాద్ ఛాప్టర్ సంయుక్తంగా నిర్వహిస్తున్న 'ఛేంజింగ్ ఫేస్ ఆఫ్ బ్రాడ్‌కాస్ట్ టెక్నాలజీ' వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. 3జి, 4జి అవసరాల కోసం విదేశాలపై ఆధారపడిన స్థాయి నుంచి స్వదేశీ పరిజ్ఞానంతో 5జి టెక్నాలజీని విజయవంతంగా అభివృద్ధి చేసిన ఘనత భారతీయ పరిశోధకులదేనని, ప్రస్తుతం, రాబోయే రోజులలో 6జి టెక్నాలజీని సహితం దేశ ప్రజలకు అందించే దిశగా పరిశోధనలు జరుగుతున్నాయని తెలిపారు. టెలీకామ్ రంగంలో వస్తున్న ఈ విప్లవం రానున్న రోజులలో 25 లక్షల ఉద్యోగాలను సృష్టించనుందని అందుకు తగ్గట్లుగా విద్యార్థులు సిద్ధం కావాలని సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ, బ్రాడ్‌కాస్ట్ ఇంజినీరింగ్‌లో వస్తున్న మార్పులను యువత నిశితంగా గమనించాలని పరిశోధనలపై దృష్టి సారించాలని కోరారు. విశాఖపట్నం ఆకాశవాణి కేంద్రం డిప్యూటి డైరక్టర్ జనరల్ సి.సుబ్బారావు మాట్లాడుతూ ఇసిఇ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అందిస్తున్నామని తెలిపారు. కమ్యూనికేషన్ రంగంలో కృత్రిమ మేధ వంటివి సాంకేతికంగా మార్పులు తీసుకొస్తున్నాయని, వాటిని విద్యార్థులు అవగాహన చేసుకోవాలని సూచించారు. బ్రాడ్‌కాస్ట్ ఇంజినీరింగ్ సొసైటి (ఇండియా) సభ్యులు ఎల్.శ్రీపతిరావు, డాక్టర్ వి.రామారావు, డాక్టర్ ఎన్.నమశ్శివాయ, బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ మాజీ డిప్యూటీ డైరక్టర్ డాక్టర్ టి.కృష్ణారావు తదితరులు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ఇఇసిఇ విభాగం సహయ ప్రొఫెసర్లు డాక్టర్ కె.కరుణకుమారి, బి.రవికిరణ్, సిఎస్ఇ విభాగం సీనియర్ ప్రొఫెసర్ నాగేశ్వరావు పాల్గొన్నారు.

ఎంక్వయిరీ ఆఫీసర్‌కు రికార్డులను అందజేస్తున్న గుర్తింపు యూనియన్ నాయకులు, హెచ్‌ఆర్ సీనియర్ మేనేజర్ చంద్రశేఖర్

పిఎఫ్ ఆఫీసుకు రికార్డులు అందజేత

ప్రజాశక్తి -గాజువాక : భెల్ హెచ్‌పివిపికి సంబంధించిన రికార్డులను శుక్రవారం పిఎఫ్ ఎంక్వైరీ ఆఫీసర్ శేషగిరిరావుకు అందజేసినట్లు గుర్తింపు యూనియన్ నాయకులు కొల్లి దేవుడు, బోండా బాబురావు తెలిపారు. ఈ యూనిట్‌లో పిఎఫ్ విషయంలో కార్మిక, ఉద్యోగుల సర్వీసు 1992వ సంవత్సరానికి బదులు 1997 పడిందని, మరికొంతమందికి 2011వ సంవత్సరం పడిందని వివరించారు. ఇలా చాలా తప్పులు ఉన్నాయని తెలిపారు. క్యాంటీన్ నుండి పర్మినెంట్ అయిన ఉద్యోగులు పిఎఫ్ సర్వీస్ విషయంలో ఉన్న లోటుపాట్లు తదితరాలపై పిఎఫ్ యాజమాన్యంతో కంపెనీ యాజమాన్యం, గుర్తింపు యూనియన్ పలు దఫాలు చర్చలు జరిపాయని తెలిపారు. చర్చల్లో పిఎఫ్ అధికారులు అడిగిన రికార్డులను ఇప్పుడు అందజేసినట్లు వివరించారు. శేషగిరిరావును కలిసిన వారిలో యాజమాన్యం నుంచి హెచ్‌ఆర్ సీనియర్ మేనేజర్ జి.చంద్రశేఖర్, గుర్తింపు యూనియన్ నాయకులు ఉన్నారు.

నేడు ఉచిత దంత వైద్యశిబిరం

ప్రజాశక్తి -మాధవధార : అనిల్ నీరుకొండ దంత వైద్య కళశాల ఆధ్వర్యాన శనివారం మాధవధారలోని మాధవ యువజన సమాజం ఆవరణలో ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో పళ్లు క్లీనింగ్, ఉచిత చెకప్, నోటి ఆరోగ్యంపై అవగాహన, పుచ్చిపళ్లుకు సిమెంటు పెట్టడం, కదిలే పళ్లు తీసి రోగులకు ఉచితంగా మందులు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని వివరించారు.

ఎల్‌ఎంవి డ్రైవింగ్ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

ఎల్‌ఎంవి డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-రంపచోడవరం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సంకల్ప్ ప్రోగ్రాం కింద ఎల్ఎంవి డ్రైవింగ్ శిక్షణా కార్యక్రమాన్ని రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఎల్ఎంవి డ్రైవింగ్ పురుషులు మాత్రమే నేర్చుకోడానికి ఆసక్తి చూపేవారని తెలిపారు. అయితే డ్రైవింగ్ కేవలం మగవారు చేసే పని మాత్రమే కాదని, గిరిజన మహిళలు కూడా నేర్చుకొని అందులో ఉపాధి అవకాశాలు పొందవచ్చని చెప్పారు. జిల్లా కలెక్టర్ ఆదేశంతో సంకల్ప పథకంలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్ట్ ఆఫీసర్ ద్వారా మల్టీ స్కిల్ స్టిచ్చింగ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ రోహిణి, కళాశాల ప్రధానోపాధ్యాయరాలు కె.వసుధ, కళాశాల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

చింతచెట్టు పై నుండి పడిన యువకుడు మృతి

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మండలంలోని కుండాడ గ్రామంలో చింత చెట్టుపై నుండి జారిపడిన యువకుడి పరిస్థితి విషమించి రాజమహేంద్రవరం ఆసుపత్రిలో గురువారం రాత్రి మృతి చెందాడు. కుండాడ గ్రామానికి చెందిన కుండ్ల సురేష్ రెడ్డి అనే గిరిజన యువకుడు గురువారం చింతపండు కోయడానికి చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన మారేడుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుండి మెరుగైన వైద్య సేవలు నిమిత్తం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించగా చికిత్స అందించారు. అయితే గురువారం రాత్రి పరిస్థితి విషమించి సురేష్‌రెడ్డి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సురేష్ రెడ్డి మృతి చెందాడని వార్త తెలియడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

10 నుండి యథావిధిగా పబ్లిక్ గ్రీవెన్స్

ప్రజాశక్తి-రంపచోడవరం : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్) కార్యక్రమం ఈనెల 10వ తేదీ నుండి ప్రతి సోమవారం యథావిధిగా నిర్వహించడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. తన ఛాంబర్‌లో శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ శాసనమండలి ఎన్నికల కోడ్ ముగిసినందున ఈనెల 10న ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కావున సమస్యల అర్జీదారులు సోమవారం గ్రీవెన్స్‌కి వచ్చి అర్జీలు సమర్పించుకోవచ్చని ప్రాజెక్ట్ అధికారి తెలిపారు.

రైల్వే ఆసుపత్రిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ:వాల్తేరు రైల్వే డివిజన్ ఆధ్వర్యంలో న్యూరాలజీ, కార్డియాలజీ సంబంధిత అంశాలపై అవగాహనతో పాటు ఎండోక్రైన్‌కు సంబంధించి వైద్యశిబిరం నిర్వహించారు. విశాఖపట్నంలోని డివిజనల్ రైల్వే ఆసుపత్రిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ శిబిరం ఏర్పాటు చేశారు. చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్కే తిరువారు జ్యోతి ఆధ్వర్యంలో రైల్వే వైద్యుల బృందం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఏసీఎంఎస్ డాక్టర్ చారుమతి , ఏసీఎంఎస్ డాక్టర్ లక్ష్మణ్ రావులు పాల్గొని ఆరోగ్య సమస్యలపై రైల్వే అధికారులకు అవగాహన కల్పించారు. మెడి కవర్ హాస్పిటల్స్ ఎండీ ఎండోక్రినాలజిస్ట్ డాక్టర్ వంశీకృష్ణ ఎండోక్రైన్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై నిరంతరం దృష్టి పెట్టాలని ఆయన సూచించారు.

'బ్లూ ఫ్లాగ్'పై రాద్ధాంతం !

గుర్తింపు రద్దు నేపథ్యంలో జిల్లా అధికారులపై ఇప్పటికే బదిలీ వేటు
దిద్దుబాటు చర్యలకు దిగిన ప్రభుత్వం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రుషికొండ ప్రాంతం నిత్యం ఏదో ఒక వివాదానికి కేంద్రంగా ఉంటూ వస్తోంది. గత ప్రభుత్వం రుషికొండపై కట్టిన టూరిజం భవంతులు వివాదమైన విషయం తెలిసిందే. తాజాగా నగరంలోని రుషికొండ బీచ్‌కు బ్లూ ఫ్లాగ్ (పరిశుభ్రతకు చిహ్నమైన నీలి రంగు తీరం) గుర్తింపు రద్దయిందన్న వార్తలతో స్థానిక భీమునిపట్నం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రంగంలోకి దిగి పరిస్థితులను చక్కదిద్దేందుకు ప్రయత్నాలు ఆరంభించారు. సాగర తీరం అంతటా అపారిశుధ్య పరిస్థితులు తాండవిస్తున్న మాట నిజమే. జివిఎంసి, ఎపి టూరిజం, విఎంఆర్‌డిఎ, పోలీస్ శాఖ ఇతర ఇంకొన్ని శాఖల సమన్వయంతో బీచ్‌ల శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉన్నా గడచిన కొద్దినెలలుగా గాలికొదిలేశారన్న విమర్శలైతే వినిపిస్తున్నాయి. ప్రస్తుతం బ్లూ ఫ్లాగ్ గుర్తింపు రద్దుతో రాజకీయ రాద్ధాంతం నడుస్తోంది.

అధికార యంత్రాంగం మెడపై కత్తి వేలాడుతోందా ?

కోపెన్ హెగెన్‌కు చెందిన ఫౌండేషన్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ (ఎఫ్ఇఇ) బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్‌ను జారీచేస్తోంది. ప్రస్తుతం ఈ సంస్థ ఈ సర్టిఫికెట్ హోదాను నిలిపివేసిందన్న ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో డిప్యూటీ కలెక్టర్ కె.జ్ఞానవేణిని జిల్లా పర్యాటక అధికారి హోదా నుంచి మాతృశాఖకు తక్షణమే ప్రభుత్వం బదిలీ చేసింది. ఎపిటిడిసి ఎమ్‌డిని కూడా బదిలీ చేస్తూ రాష్ట్ర ఎపిటిడిసి ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఈ రెండు చర్యలూ రాష్ట్ర ప్రభుత్వ సిఎం కార్యాలయం నుంచి జరిగాయనడంలో ఎలాంటి సందేహమూ లేదు. ఇంకొందరి మెడపైనా కత్తి వేలాడుతున్నట్టు సమాచారం.

ప్రమాణాల మాటేమిటి ?

సాగర తీరాల్లో పరిశుభ్రత, ఇతర ఆరోగ్య ప్రమాణాలనేవి పరిపాలనా నిర్వహణలో భాగంగానే జరగాల్సిన పనులు. అవసరమైనంత మంది పారిశుధ్య సిబ్బంది రుషికొండ బీచ్‌లో విధులు నిర్వహించడానికి ఉండాలి. కానీ తక్కువ మంది ఉన్నారు. పండగలు, ప్రత్యేక రోజుల్లో ఇక్కడకు పెద్ద ఎత్తున పర్యాటకుల తాకిడి ఉంటుంది. సుమారు లక్ష మంది వరకూ వస్తుంటారు. వారికి సౌకర్యాల కల్పన కత్తిమీది సాములా మారింది. జిల్లా అధికార యంత్రాంగంపై పై నుంచి ఒత్తిళ్లు ఉన్నాయి. రుషికొండ బీచ్‌కు బ్లూ ఫ్లాగ్ ట్యాగ్ (దేశంలో 10 బీచ్‌ల్లో ఇది ఒకటి) గతంలో దక్కింది. కొద్ది నెలలుగా ఈ ప్రాంత పర్యాటక సొబగుల విషయంలో పాలనాపరమైన వైఫల్యం కనిపిస్తోంది. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి సర్కారు ఒక్క రుషికొండ ప్రాంతాన్నే కాదు తీరం అంతటా పర్యాటక రద్దీ పెరిగిపోతున్నా పెద్దగా పట్టించుకున్న దాఖలా లేదు. ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోయింది. ఆ సమస్యలన్నింటినీ పరిష్కరించాల్సి ఉంది. వాస్తవానికి రుషికొండ బ్లూ ఫ్లాగ్ సమస్య పెద్ద సమస్యేమీ కాదు. పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తే సమస్య పరిష్కారమవుతుంది. కానీ ఈ విషయాన్ని రాజకీయం చేస్తున్నారు. వైసిపి, టిడిపిలు పరస్పర విమర్శలకు దిగుతున్నాయి. ఎపికి ప్రత్యేక హోదా, విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ అంశాలు పట్టని ప్రధాన పార్టీల నేతలు బ్లూ ఫ్లాగ్‌పై తప్పు మీదంటే మీదే అని రాద్ధాంతానికి దిగుతున్నారు.

దిద్దుబాటు చర్యలు

రుషికొండ దిద్దుబాటు చర్యల పేరుతో రూ.కోట్ల ఖర్చుకు ప్రజాప్రతినిధులు ప్రణాళికలు సిద్ధం చేశారు. రూ.15 కోట్లతో సాగర్‌నగర్ బీచ్ సుందరీకరణ పనులు చేపట్టబోతున్నారు. సాగర్ నగర్‌లో రూ.2 కోట్లు, రుషికొండలో రూ.2 కోట్లతో ఈటర్స్ జోన్లు ఏర్పడబోతున్నాయి. ఈ నిధుల్లో కేంద్ర ప్రభుత్వం రూ.50 లక్షలు చొప్పున అందించనుంది. అలాగే ఇస్కాన్ టెంపుల్‌కు ఎదురుగా రూ.9 కోట్లతో 20 ఎకరాల్లో సుందరీకరణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇలా విశాఖ పర్యాటకులను ఆకట్టుకునే చర్యల దిశగా మాజీ మంత్రి, భీమిలి ఎంఎల్‌ఎ గంటా శ్రీనివాసరావు దిద్దుబాటు చర్యలు ఆరంభించారు. ప్రత్యేకంగా సిసి కెమెరాలు, సెక్యూరిటీ, పార్కింగ్ వంటి ప్రమాణాలు రాబోతున్నాయి. అధికార పార్టీ వారికి ఈ కాంట్రాక్టులు దక్కేలా ప్లాన్ చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వాలంటీర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాలంటీర్లకు ఉగాది లోగా తీపి కబురు చెప్పాలని ఎపి గ్రామ వలంటీర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గంధం దీప్తి డిమాండ్ చేశారు. శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద గ్రామ, వార్డు వాలంటీర్స్ అసోసియేషన్ అన్ని సంఘాల జెఎసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,రూ.10 వేలకు జీతం పెంచుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు చెప్పారన్నారు.ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా వాలంటీర్లను కొనసాగిస్తామని, రూ.10 వేలు జీతం ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రతిపక్షంలో ఉండేటప్పుడు వాలంటీర్లను కొనసాగిస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత మాట మార్చారని ఆరోపించారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా వలంటీర్లను ప్రతి సంవత్సరం రెన్యువల్ చేశారన్నారు. ఎ.పి. గ్రామ వాలంటీర్ అస్సోసియేషన్ రాష్ట్ర సలహాదారులు ఈదర గోపీచంద్ (నరసరావు పేట) మాట్లాడుతూ, చంద్రబాబు వాలంటీర్లను మోసం చేశారన్నారు. వాలంటీర్లకు జీతం రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. వాలంటీర్లకు మార్చి 29 తేదీ లోపు చంద్రబాబు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు వాలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకట్, షేక్ హుమయాన్ భాషా, అసోసియేషన్ అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్ము సురేష్ బాబు, జిల్లా నాయకులు ప్రసాద్, కొండమ్మ, రాజేష్, జగదీష్, వెంకటసుబ్బయ్య, విశాఖ జిల్లా నాయకులు కోడూరు లక్ష్మణ్, రాము, పార్వతి పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న ఆర్‌టిసి కార్మికులు

కనీస వేతనాల కోసం ధర్నా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కనీస వేతనాలు చెల్లించాలంటూ ఎపిఎస్ ఆర్‌టిసి కాంటాక్ట్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలకా సత్యనారాయణ మాట్లాడుతూ కాంట్రాక్ట్, హైర్ బస్ డ్రైవర్లు, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి జిల్లా ప్రజా రవాణా అధికారి యూనియన్ల నాయకులతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ విశాఖ జిల్లా అధ్యక్షులు కెజెఎ.రావు (శివ), రాష్ట్ర కార్యదర్శి వి.తులసీరామ్ మాట్లాడుతూ ఆర్‌టిసిలో రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. అతి తక్కువ జీతాలతో పనిచేస్తున్నారని తెలిపారు. కాంట్రాక్టర్‌తో కుదుర్చుకున్న అగ్రిమెంట్ ప్రకారం కార్మికుల సమస్యలను పరిష్కారం చేయడం లేదన్నారు. కార్మిక చట్టాలు అమలు కావడం లేదని ఆవేదన వెలిబుచ్చారు.

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద..

కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.35 వేలు చెల్లించి, రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతన బోర్డును ఏర్పాటు చేయాలని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. వాల్తేరు రైల్వే డివిజన్ కాంట్రాక్టు కార్మికులు, హిందూజా పవర్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు, శ్రావణి షిప్పింగ్ కళాసీలు, స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. వారినుద్దేశించి ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె.అచ్యుత్‌రావు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బూసి వెంకటరావు, జిల్లా అధ్యక్షులు ఎం.మన్మధరావు మాట్లాడారు.

ఆదివాసీ జెఎసి సమావేశాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-సీలేరు : ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జెఎసి వార్షిక ఉద్యమ కార్యాచరణపై ఈ నెల 9న చింతూరులో జరగనున్న రాష్ట్రస్థాయి విస్తృత సమావేశాన్ని జయప్రదం చేయాలని జెఎసి రాష్ట్ర ఉపాధ్యక్షులు మొట్టడం రాజబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఏజెన్సీ ప్రాంతంలో రోజురోజు చాపకింద నీరుల గిరిజనేతరుల వలసలు పెరుగుతూ ఆదివాసీ సమాజాన్ని అణచివేస్తున్నారని, షెడ్యూల్డ్ ప్రాంత సంపదను అక్రమంగా దోచుకుంటున్నారని ఆరోపించారు. గిరిజన చట్టాలను ఆదివాసీ ప్రజా ప్రతినిధులతోనే తొలగించే విధంగా కుట్ర చేస్తున్నారని తెలిపారు. ఇటువంటి నేపథ్యంలో ఆదివాసీ జెఎసి కమిటీలను బలోపేతం చేయవలసిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆదివాసీ ప్రాంత సమస్యలపై ఈ సమావేశంలో ఉద్యమ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర కమిటీతో పాటు శ్రీకాకుళం, మన్యం పార్వతీపురం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల కమిటీ సభ్యులు, చింతూరు డివిజన్ కమిటీ సభ్యులు, ముంపు మండలాల కమిటీ బాధ్యులు హాజరుకావాలని కోరారు.

పౌష్టికాహార కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-రంపచోడవరం : రాజమహేంద్రవరం రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో, ఇన్ఫోసిస్ వారి ఆర్థిక సహాయంతో మాత శిశ సంరక్షణ పథకం ద్వారా రంపచోడవరం మండలం పెద్దగెద్దాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు, 0-3సంవత్సరాలు పిల్లలకు 180 పౌష్టికాహార కిట్లు, మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా రామకృష్ణ మిషన్ డిస్పెనరీ ఇన్‌ఛార్జి స్వామి రఘువీరానందజీ మహారాజ్, రిటైర్డ్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గుండేమెను రామారావు, పెద్దగెద్దాడ పిహెచ్‌సి వైద్యాధికారి ఆర్.వినోద్ కుమార్, కె.శ్వేతదేవి తల్లులు, బిడ్డల ఆరోగ్యంపై పలు సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్, క్యాంప్ కో ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, బదిరెడ్డి సూరిబాబు, మాజీ జెడ్‌పిటిసి యర్రా వెంకట రామకృష్ణ, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, రామకృష్ణ మిషన్ సిబ్బంది పాల్గొన్నారు.